# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదంపై ధీటైన పోరాటానికి “ఆపరేషన్ సిందూర్” ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు.
- భారతదేశం రేపు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకునేందుకు సిద్ధమైంది.
- జమ్మూ కాశ్మీర్ కిష్త్వార్ జిల్లాలో ఈరోజు మేఘాల విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి.
- పాకిస్థాన్ దుస్సాహసానికి పాల్పడితే భారీ మూల్యం చెల్లించక తప్పదని భారత్ హెచ్చరించింది.
- జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ సహా కోస్తాంధ్రలో రేపు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై ధీటైన పోరాటానికి “ఆపరేషన్ సిందూర్” ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొద్ది సేపటి క్రితం రాష్ట్రపతి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశాన్ని కాపాడే విషయంలో భారత సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఆర్థికంగానే కాకుండా అన్ని విధాలుగా స్వావలంబన దేశంగా భారత్ అవతరిస్తోందన్నారు. ఈ లక్ష్య సాధనలో దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం రేపు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఎర్రకోట నుండి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం జాతిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆపరేషన్ సిందూర్ విజయాన్ని సైతం దేశమంతటా జరుపుకునేలా కార్యక్రమాలు

రూపొందించారు. ఎర్రకోటలో జరిగే వేడుకలను వీక్షించడానికి వివిధ రంగాల నుండి సుమారు ఐదు వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. వీరిలో స్పెషల్ ఒలింపిక్స్ 2025 భారత బృందం, అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల విజేతలు, ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో బంగారు పతక విజేతలు ఉన్నారు. అదే విధంగా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ఈ నేపధ్యంలో జరిగే స్వాతంత్ర్య వేడుకలు ఆ లక్ష్యాన్ని మరింతగా ప్రతిబించేలా ఉండబోతున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఈరోజు మేఘాల విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో అనేక మంది మరణించారని, చాలామంది గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ పెను విపత్తు కారణంగా ఆస్తి నష్టం కూడా భారీగా సంభవించింది. రక్షణ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలను ప్రారంభించాయి. జమ్మూ కాశ్మీర్ లో మేఘాల విస్ఫోటనం కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. అనేక మంది మరణించిన వార్త చాలా బాధాకరమని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. ఇక ఈ విపత్తు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రక్షణ సహాయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో మాట్లాడినట్లుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్థాన్ దుస్సాహసానికి పాల్పడితే భారీ మూల్యం చెల్లించక తప్పదని భారత్ హెచ్చరించింది. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... భారతదేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకునే విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు, వైఫల్యాలను దాచేందుకు భారత్‌పై విషం చిమ్ముతోందన్నారు. పాకిస్థాన్ తన దుందుడుకు వైఖరిని ఇకనైనా మానుకోవాలని సూచించారు. పాకిస్థాన్ ప్రోత్సాహిస్తున్న సీమాంతర ఉగ్రవాద చర్యలకు ప్రతిగానే సింధూ జలాల విషయంలో భారత్ కీలకమైన నిర్ణయం తీసుకుందన్నారు. పాకిస్తాన్ యుద్ధోన్మాద, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం మంచి విధానం కాదని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మొత్తం 1,090 మంది పోలీసు, అగ్నిమాపక, హోం గార్డ్స్‌కు శౌర్య సేవా పతకాలు ప్రదానం చేయనున్నారు. 233 మంది సిబ్బందికి శౌర్య పతకం, 99 మంది సిబ్బందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 758 మంది సిబ్బందికి ప్రతిభావంతులకు ఇచ్చే సేవా పతకాలు లభించాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈరోజు వెల్లడించింది. 16 మంది సరిహద్దు భద్రతా దళ సిబ్బందికి, విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావానికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పతకాలను ప్రకటించింది. అదే విధంగా నలుగురు భారత వైమానిక దళ అధికారులకు ఉత్తమ యుద్ధ సేవా పతకాన్ని ప్రదానం చేయనున్నారు. భారత సైన్యంలోని నలుగురు అధికారులకు కీర్తి చక్ర, ఎనిమిది మంది అధికారులకు శౌర్య చక్రను అందచేయనున్నారు. దేశ గగనతలాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించినందుకు భారత వైమానిక దళానికి చెందిన 13 మంది అధికారులకు ప్రతిష్టాత్మక యుద్ధ సేవా పతకాలను ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులు ప్రతి సమస్యను ఆత్మవిశ్వాసంతో నిర్భయంగా ఎదుర్కోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అండమాన్ నికోబార్ దీవులకు చెందిన 30 మంది హయ్యర్ సెకండరీ గిరిజన విద్యార్థులతో ఆయన ఈ రోజు ఢిల్లీలో

సంభాషించారు. భారతదేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకటిగా నిలపడానికి రేపటి పౌరులుగా విద్యార్థులు సమర్థంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా వారికి రాజ్ నాథ్ సింగ్ సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని వీధి కుక్కలను ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని ఈ నెల 11న ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలను నిలిపివేయాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్ట్ ఈరోజు తీర్పును రిజర్వ్ చేసింది. ఢిల్లీ నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కుక్కల నియంత్రణకు స్థానిక అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. కుక్కల బెడదకు వారే కారణమని ధర్మాసనం పేర్కొంది. పార్లమెంటు చట్టాలు, నిబంధనలు రూపొందిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలను అవలంబిస్తోందని కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ సంస్థల సమగ్రతను కాంగ్రెస్ పార్టీ అదే పనిగా ప్రశ్నిస్తోందన్నారు. ఈ అంశంపై ప్రజలను సైతం తప్పుదారి పట్టించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,539 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 58 పాయింట్లతో 80,597 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12 పాయింట్ల లాభంతో 24,631 పాయింట్ల వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, కోస్తాంధ్రలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తాంధ్రాలో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. ఆ వివరాలను వాతావరణ అధికారి అమిత్ కుమార్ వెల్లడిస్తూ..

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =